# 62

# పస్కా పండుగ

## (26:17-29)

కాలక్రమానుగత వృత్తాంతము సంపూర్తిగా స్పష్టముగా లేనప్పటికిని, పస్కాపండుగ మహోత్సవమును జరుపుకొనుటకు చేయబడుచుండిన సిద్ధపాటులు బేస్తవారము నాడు చేయబడినవని విశదముగా విదితమగుచున్నది (26:17-19). పస్కాను పాటించుట మరియు ప్రభువు భోజన సంస్కారము వ్యవస్థాపింపబడుట అదే సాయంకాలము జరిగినది. యూదులు ఒక దినమును లెక్కించు పద్ధతి ప్రకారము (ఈ వేళటి సాయంకాలము ఆరు గంటలు మొదలుకొని మరుసటి దినము సాయంకాలము ఆరు గంటల వరకు), అది శుక్రవారము (26:20-29).

### సిద్ధపాటు (26:17-19)

**17పులియని రొట్టెల పండుగలో మొదటి దినమందు, శిష్యులు యేసునొద్దకు వచ్చి–పస్కాను భుజించుటకు మేము నీకొరకు ఎక్కడ సిద్ధపరచ గోరుచున్నావని అడిగిరి.**
**18అందుకాయన–మీరు పట్టణమందున్న ఫలాని మనుష్యునియొద్దకు వెళ్లి–నా కాలము సమీపమైయున్నది; నా శిష్యులతో కూడ నీ యింట పస్కాను ఆచరించెదనని బోధకుడు చెప్పుచున్నాడని అతనితో చెప్పుడనెను.**
**19యేసు తమ కాజ్ఞాపించిన ప్రకారము శిష్యులు చేసి పస్కాను సిద్ధపరచిరి.**

**వచనము 17. పులియని రొట్టెల పండుగ** (పస్కా), దేవుడు ఇశ్రాయేలీయులకు ఐగుప్తు దాసత్వములో నుండి విడుదల కలుగజేసిన విధానమును స్మరణకు తెచ్చుకొనుచు యూదులు జరుపుకొనుచుండిన ఒక మహోత్సవమై యుండినది. దేవుడు ఐగుప్తీయుల తొలి సంతానమును సంహరించినప్పుడు, గొఱ్ఱెపిల్ల రక్తము ద్వారబంధముల పైకమ్ములపై పూయబడిన ఇశ్రాయేలీయుల ఇండ్లను ఆయన "దాటి పోయెను" (నిర్గమకాండము 12:13, 23, 27). పస్కా పండుగ ఒక్క రాత్రి మహోత్సవముగా జరుపుకొనబడినది, మరియు దాని తరువాతి ఏడు రోజులు పులియని రొట్టెలు భుజించబడినవి. ఈ కాలమంతటిని కలిపి "పులియని రొట్టెల పండుగ" అని పేరుపెట్టబడినది (నిర్గమకాండము 12:15-20; లేవియకాండము 23:4-8; సంఖ్యాకాండము 28:16-25; ద్వితీయోపదేశకాండము 16:1-8). పస్కా భోజనము **పులియని రొట్టెల పండుగ దినములలోని తొలి రోజున** భుజింపబడినందు వలన, "పులియని రొట్టెల పండుగ" మరియు "పస్కా పండుగ" అను పేరులు మార్చి మార్చి ప్రయోగింపబడినవి (మార్కు 14:1, 12; లూకా 22:7).

అధికారిక పస్కా పండుగ మహోత్సవము యూదుల అబీబు, లేక నీసాన్ మాసములోని పదునాలుగవ దినమున జరుపుకొనబడినది. ధర్మశాస్త్రము ప్రకారము, పస్కా గొఱ్ఱెపిల్ల ఈ

మాసములోని పదవ దినమున ఎంపిక చేసుకొనబడవలెను. ఈ మాసములోని పదునాలుగవ దినము వరకు గొఱ్ఱెపిల్లను ఇంటి లోపల ఉంచవలెను (నిర్గమకాండము 12:2-6). అది "సంధ్యా సమయంలో," అనగా "రెండు (సంధ్యా సమయాలు) సాయంకాల వేళలకు నడుమ అని అక్షరార్థమిచ్చు సమయంలో, వధింపబడవలెను. ఈ విధంగా చెప్పుకొనబడునది బహుశా సూర్యాస్తమయము మరియు చీకటి కమ్ముటకు మధ్య గల సమయమును సూచించవచ్చును.

క్రొత్త నిబంధన కాలము నాటికి, పస్కా గొఱ్ఱెపిల్లలు తొమ్మిది మొదలుకొని పదకొండు గంటల మధ్య కాలములో (సాయంకాలము మూడు గంటలు మొదలుకొని ఐదు గంటల మధ్య కాలము) బల్యర్పణ గావింపబడినవి.[1] పస్కా పండుగ నాచరించుటకు వేలాది మంది యాత్రికులు యెరూషలేమునకు వచ్చుచుండినందు వలన, పస్కా గొఱ్ఱెపిల్లలు యెరూషలేము దేవాలయము యొద్ద భారీ సంఖ్యలో మూడు వంతులుగా వధింపబడినవి. ఎవరి పస్కా గొఱ్ఱెపిల్లను వారే వధించుటకు ప్రజలు బాధ్యులై యుండిరి. తోలు తీయుటకు వారు వధింపబడిన పస్కా గొఱ్ఱెపిల్లను గోడలకు దిగగొట్టబడిన కొక్కెములకు లేక స్తంభములకు వ్రేలాడదీయుచుండిరి. యాజకులు వరుసగా నిలువబడి గొఱ్ఱెపిల్ల నుండి కార్చబడిన రక్తముతో నిండియుండిన పాత్రలు (గిన్నెలు) అందించుచుండిరి. బలిపీఠమునకు దగ్గరగా నుండిన యాజకుడు ఆ విధముగా తనకందించబడిన పాత్రలోని రక్తమును దాని మూలముపై పోయుచుండెను. ప్రజలు బల్యర్పణల భాగములను తీసి యాజకులకు ఇచ్చుచుచుండగా, యాజకులు వాటిని బలిపీఠముపై దహనము చేయుచుండిరి. మిగిలిన గొఱ్ఱెపిల్ల భాగము(లు)ని ఇంటికి కొంచుబోవుచుండిరి; మాంసమును కొయ్య సూదికి తగిలించి మట్టి బట్టీలో కాల్చుకొని పస్కా భోజనములో భాగంగా ఆరగించుచుండిరి.[2]

**వచనము 18.** వారు పస్కాను భుజించుటకు ఎక్కడ సిద్ధపరచగోరుచున్నాడో యని అపొస్తలులు యేసును అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చుచు ఆయన, వారు **యెరూషలేము లోనికి ఫలాని మనుష్యుని** యొద్దకు వెళ్లవలెనని శిష్యులలో ఇద్దరితో చెప్పాడు. అక్కడ నీళ్ల కుండ మోయుచున్న యొక మనుష్యుడు వారికెదురుపడునని చెప్పాడు (మార్కు 14:13; లూకా 22:10). శిష్యులు ఇతనిని అతి సులభముగా గుర్తుపట్టగలరు ఏలయనగా సాధారణంగా నీళ్ల కుండలను స్త్రీలు మోయుచుండిరి. కాబట్టి శిష్యులు ఆ మనుష్యుని కనుగొనిన తరువాత అతని వెంట అతని ఇంటికి వెళ్లి అతనికి రెండు విషయాలు తెలియజెప్పవలెనని యేసు చెప్పాడు.

వారతనికి తెలియజెప్పవలసిన మొదటి విషయము, **నా కాలము సమీపమై యున్నది**, ఈ విషయము అత్యంత ఆసన్నముగా నుండిన యేసు మరణమును సూచించినది. పస్కా భోజనము కొరకైన సిద్ధపాటులు బేస్తవారము నాడు చేయబడినవి, మరుసటి రోజు యేసు సిలువవేయబడును. ఇదే విధమైన భాష యోహాను వ్రాసిన సువార్తలో తరుచుగా కనబడును. "కాలము"నకు (*kairos*) బదులుగా, యోహాను "గడియ" (*hōra*) అని వ్రాయుచున్నాడు (యోహాను 2:4; 7:30; 8:20; 12:23; 13:1; 17:1; మత్తయి 26:45 చూడు).

వారు ఆ మనుష్యునితో చెప్పవలసిన రెండవ విషయమేమనగా, **నా శిష్యులతో కూడ నీ యింట పస్కాను ఆచరించెదనని బోధకుడు చెప్పుచున్నాడు.** శిష్యులు, "నేను నా శిష్యులతో కూడ పస్కాను భుజించుటకు విడిది గది యెక్కడనని బోధకుడు నిన్నడుగుచున్నాడని" వారు

ఆ మనుష్యుని అడుగవలసి యుండిరి (లూకా 22:11), అప్పుడతడు "సామాగ్రి గల యొక గొప్ప మేడగది" వారికి చూపించును; అక్కడ వారు పస్కా భోజనమును సిద్ధపరచవలసినది యేసు తన శిష్యులతో చెప్పాడు (లూకా 22:12). యెరూషలేములో నివసించుచుండినవారు వారి ఇంటిలో ఉండిన అదనపు చోటును పస్కా పండుగ నిమిత్తము పట్టణమునకు వచ్చిన ఇతర యూదీయ కుటుంబికులతో సాధారణముగా పంచుకొనుచుండిరి. యేసు తనను తాను **బోధకుడు** అని సంబోధించుకొనుచున్నాడు కాబట్టి ఆ మనుష్యుడు యేసు అనుచరుడై యుండును.

**వచనము 19. శిష్యులు** విధేయతతో యేసు తమ కాజ్ఞాపించిన ప్రకారము చేసినప్పుడు, వారు అన్ని విషయాలను సరగ్గా ఆయన చెప్పినట్లే కనుగొన్నారు. గనుక వారు **పస్కాను సిద్ధపరచారు**. శిష్యులు ఒక గొఱ్ఱెపిల్లను బల్యర్పణగావించి, దాని మాంసమును కాల్చుట మాత్రమే గాక, వారు పులియని రొట్టె, ద్రాక్షరసము, చేదు కూరలు, మరియు పులుసులాంటి ద్రవము (సాస్) కూడ కొనుగోలు చేయవలసి యుండును.

## విద్రోహి ఎవరో ప్రకటింపబడుట (26:20-25)

**[20]సాయంకాలమైనప్పుడు ఆయన పంట్రెండుమంది శిష్యులతోకూడ భోజనమునకు కూర్చుండెను. [21]వారు భోజనము చేయుచుండగా ఆయన-మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. [22]అందుకు వారు బహు దుఃఖపడి ప్రతి వాడును-ప్రభువా, నేనా? అని ఆయన నడుగగా [23]ఆయన-నాతోకూడ పాత్రలో చెయ్యి ముంచినవాడెవడో వాడే నన్ను అప్పగించువాడు. [24]మనుష్యకుమారునిగూర్చి వ్రాయబడిన ప్రకారము ఆయన పోవుచున్నాడు గాని యెవనిచేత మనుష్యకుమారుడు అప్పగింపబడుచున్నాడో ఆ మనుష్యునికి శ్రమ; ఆ మనుష్యుడు పుట్టియుండనియెడల వానికి మేలని చెప్పెను. [25]ఆయనను అప్పగించిన యూదా-బోధకుడా, నేనా? అని అడుగగా ఆయన-నీవన్నట్టే అనెను.**

**వచనము 20.** 26:20-25లో వ్రాయబడిన విషయము చోటుచేసికొనినప్పటికి, **సాయంకాలమైనప్పుడు ఆయన తన పంట్రెండు మంది శిష్యులతో కూడ** పస్కా **భోజనమునకు కూర్చుండెను.** అతిశయముతో నిండిన తన శిష్యులకు అణకువ మరియు వినయము గూర్చిన (గుణ) పాఠము నేర్పించునట్లు ఆయన తన శిష్యుల-ఇస్కరియోతు యూదాతో సహా-పాదములను అదివరకే కడిగాడు (యోహాను 13:3-11).[3] ఆ రోజుల్లోని అలవాట్లను అనుసరించుచు, ప్రభువైన యేసు క్రీస్తు మరియు ఆయన శిష్యులు భోజనపు బల్ల యొద్ద కూర్చొనియుండరు, ఈ వివరము లియోనార్డొ డా విన్సి రచించిన పేరుప్రఖ్యాతులుగల ప్రభు రాత్రి భోజన చిత్రలేఖనము చిత్రీకరించుచున్న దానినిబట్టి తెలియుచున్నది. దానికి బదులుగా, వారు అలసిపోయి ఒక ప్రక్కకు ఆనుకొని యుందురు (*anakeimai*), బహుశా తక్కువ ఎత్తుగా నున్న ఒక **బల్ల** చుట్టూర తలగడలు వేసుకొని తమ మోచేతులపై ప్రక్కకు ఆనుకొని యుందురు.

ఆదిలో, పస్కా జోజనము నిలువబడి ఆరంగింపబడుచుండినది. "మీరు దానిని తినవలసిన విధమేదనగా, మీ నడుము కట్టుకొని, మీ చెప్పులు తొడుగుకొని, మీ కఱ్ఱలు

చేత పట్టుకొని, త్వరపడుచు దాని తినవలెనని" దేవుడైన యెహోవా ఇశ్రాయేలీయులకు ఆదేశములిచ్చాడు (నిర్గమకాండము 12:11). దేవుడు వారిని త్వరలోనే ఐగుప్తు దాసత్వము నుండి నిష్క్రమించునట్లు వారిని విడిపించునను నమ్మకముతో, వారు ఈ భంగిమలో కూర్చుండవలసినవారై యుండిరి. ఏది ఏమైనా, యేసు రోజుల్లో పస్కా భోజనము విశేషంగా చేరగిలబడి ఆరంగించబడుచుండినది.

గ్రీకు దేశస్థుల మరియు రోమీయుల మిశ్రమ సంస్కృతి చేత ప్రభావితము చేయబడినవారై, యూదులు సామాన్యముగా మూడు వైపులా సోఫాలున్న భోజనాల బల్లను (*triclinium*) ఉపయోగించుచుండిరి. భోజనము చేయుటకు చేయబడిన ఈ ఏర్పాటులో ఒక U (యు) ఆకారమున్న సోఫా ఉంచబడినది; దాని మూడు వైపులు దాదాపుగా గది అంతటిని ఆక్రమించుకొనునట్లు పొడిగింపబడినవి. భోజనమును ఉంచుటకు మధ్యలో తక్కువ ఎత్తు గల ఒక బల్ల ఏర్పాటుచేయబడినది. అతిథులు అలసిపోయినవారై, బల్లకు దూరముగా కాళ్లు పారజాపుకొని యుందురు. వారు తమ ఎడమ మోచెయ్యిపై ఆనుకొని, కుడి చేతితో భోజనము చేయుచుండిరి. అతిథేయి మధ్యస్థంగా ఆనుకొని కూర్చుండి యుండును, గౌరవనీయులైన అతిథులు ఆయనకు కుడి ప్రక్కన మరియు ఎడమ ప్రక్కన కూర్చుండి యుందురు. ఈ సమయంలో, యేసు అతిథేయిగా వ్యవహరించాడు, ఆయన ప్రేమించిన శిష్యుడు, యోహాను యేసు కుడి చేతి వైపున కూర్చుండి యుండెను (యోహాను 13:23). ఒక ప్రాచీన *triclinium* సోఫా నమూన పోంపేయ్‌లో కలదు, అది, క్రీ.శ. 79లో అకస్మాత్తుగా పేలిన అగ్నిపర్వతము, వెసువియస్ పర్వతము, బూడిదలో భద్రపరచబడినది.

మొదటి శతాబ్దము నాటికి, యూదులు పస్కా భోజన సమయంలో ఒక "ఆరాధన క్రమము"ను (*seder*) అనుసరించారు.[4] మొదట ఆశీర్వచనము పలుకబడిన తరువాత, అందరికి ద్రాక్షారసముతో నిండిన మొదటి గిన్నె అందించబడినది. దాని తరువాత చేదు ఆకుకూరలు కొన్ని పులియని రొట్టెలతోపాటు ఆరగింపబడినది.[5] ఆ తరువాత ద్రాక్షారసముతో నిండిన రెండవ గిన్నె అందజేయబడినది. నిర్గమకాండము 12:26ను అనుసరించుచు, వారు ఆరగించుచుండిన పస్కా భోజనము యొక్క భావమేమిటో ఒక కుమారుడు తన తండ్రిని ప్రశ్నించును. అప్పుడు అతని తండ్రి ఐగుప్తు దాసత్వము మరియు దేవుడు వారిని విడిపించినందు వలన వారు ఐగుప్తు నుండి నిర్గమించుట మొదలగు విషయములను తానే స్వయంగా అనుభవించినట్లుగా వర్ణించును (నిర్గమకాండము 13:8). ఆ తరువాత స్తోత్ర గీతము (హల్లేల్ – కీర్తనలు 113; 114) మొదటి భాగము పాడబడును, ఆ తరువాత కాల్చబడిన పస్కా గొఱ్ఱెపిల్ల[6] మాంసము మరియు పులియని రొట్టెలు ఆరగించుదురు. దీని తరువాత ద్రాక్షారసముతో నిండిన నాలుగవ గిన్నె అందజేయబడినది. అది ముగిసిన తదనంతరము స్తోత్ర గీతములోని రెండవ భాగము (కీర్తనలు 115–118) పాడబడినది.

**వచనము 21.** భోజన సమయములో, వారిలో **ఒకడు** ఆయనను **అప్పగించునని** యేసు తన శిష్యులకు తెలియజెప్పాడు. శిష్యులీమాటలను నమ్మలేకపోయారు, గనుక వాడెవడు? అని ప్రశ్నించుచున్నట్లు ఒకరి ముఖమును మరొకరు చూచుకొనుచు ప్రశ్నార్థక సంకేతములు వారి వ్రేళ్లతో చూపించుకొనుటకు మొదలుపెట్టారు. లూకా వ్రాసిన సువార్త ప్రకారము, "ఈ పనిని చేయబోవువాడెవడో అని తమలో తాము అడుగుకొనసాగిరి" అని వ్రాయబడి యున్నది (లూకా 22:23).

**వచనము 22.** ఒకడు తన యజమానునే అప్పగించుట గూర్చిన ఆలోచన శిష్యులు దాదాపుగా భరించగల దానిని మించినదయ్యింది, గనుక వారు **బహు దుఃఖపడిరి** (17:23; 18:31 చూడు). అందువలన వారిలో **ప్రతి వాడును, ప్రభువా, నేనా?** అని యేసును అడిగారు. ఈ ప్రశ్న ఉద్ఘాటనతో కూడినదై యుండి ("ఖచ్చితంగా నేను కాదు కదా, ప్రభువా?"), వ్యతిరేకార్థక సమాధానమును ఆశించుచుండినది.

**వచనము 23.** అందుకు యేసు, **నాతో కూడ పాత్రలో చెయ్యి ముంచినవాడెవడో వాడే నన్ను అప్పగించువాడు** అని సమాధానమిచ్చాడు. ఈ ప్రస్తావన బహుశా పులియని రొట్టె ముక్క నొకదానిని తీసికొని సాస్ వంటి ద్రావకమున్న గిన్నెలో ముంచుట గూర్చినదై యుండును.[7] ఆ నాటి సంస్కృతిలో, మరొకరితో కలిసి భోజనము చేయుట స్నేహము మరియు ఐక్యతను సూచించినది. మరొకరి భోజనములో పాలుపంచుకొనినప్పుడు, పంచుకొనుచున్న ఎదుటి వ్యక్తి, "నేను నీకు హాని చేయను" అని చెప్పుచున్నదానికి సారాంశ సంకేతమై యుండినది. ఇస్కరియోతు యూదా యేసుతో కూడ భోజనము చేసాడను వాస్తవము, రొట్టె ముక్కను ఒకే గిన్నెలో ముంచుకొనుట సహితము, అతడు యేసును అప్పగించు విషయమును యింకా ఎక్కువ అగౌరవమైన చర్య గావించినది. "నేను నమ్ముకొనిన నా విహితుడు నా యింట భోజనము చేసినవాడు, నన్ను తన్నుటకై తన మడిమె నెత్తెను" అని కీర్తనకారుడు వాపోతున్నాడు (కీర్తనలు 41:9). యూదా యేసును అప్పగించుట వలన ఎట్టకేలకు ఈ వాక్యభాగము నెరవేరినదని యోహాను ఎంచుచున్నాడు (యోహాను 13:18).

**వచనము 24. మనుష్యకుమారుడు పోవలసి యున్నది** అంటూ యేసు తన సంభాషణ కొనసాగించాడు – ఇది ఆయన సిలువమరణమును గూర్చిన ప్రస్తావనయై యున్నది. **మనుష్యకుమారుని గూర్చి వ్రాయబడిన ప్రకారము** అను పదజాలము యేసు మరణము పాత నిబంధన లేఖనముల నెరవేర్పైయున్నదని నొక్కివక్కాణించుచున్నది (కీర్తనలు 22:16; యెషయా 53:3–12). యేసు మరణించవలెనని దేవుడు ముందుగానే సంకల్పించినప్పటికిని, ఇస్కరియోతు యూదా తన సొంత చర్యలకు బాధ్యుడై యుండెను (అపొస్తలుల కార్యములు 2:23; 3:13–19; 13:27–29). ఇస్కరియోతు యూదా అప్పగింతలో గల దోషభావము మరియు శిక్షనుబట్టి, **ఆ మనుష్యుడు పుట్టియుండని యెడల వానికి మేలని** యేసు సెలవిచ్చాడు.

**వచనము 25.** యేసును **బోధకుడా** ("నా ప్రభువా/యజమానుడా") అని సంబోధించుచు, **యూదా** కూడ ఇతర శిష్యులందరు అడిగిన అదే ప్రశ్న యేసును అడిగాడు: **నేనా?** (26:22 చూడు). **అందుకు యేసు, నీవన్నట్టే అనెను.** ఈ మాటలు, "ఔనయ్యా, నీవే అని పరోక్షంగా చెప్పుచుండినవై యున్నవి. అటుతరువాత, యేసు ప్రధాన యాజకునికి కూడ ఇదే విధముగా సమాధానమిచ్చాడు (26:64).

ఈ సన్నివేశమునకు సంబంధిచిన అదనపు వర్ణనలు యోహాను 13:23–30లో కలవు. వారందరు పస్కా విందు నిమిత్తము చేరగిలబడి కూర్చుండి యున్నప్పుడు యేసు ప్రేమించిన శిష్యుడు (యోహాను) యేసు రొమ్మున ఆనుకొని యుండి, "ప్రభువా, వాడెవడు?" అని యేసును ప్రశ్నించాడు. అందుకు యేసు, "నేనొక ముక్క ముంచి యెవనికిచ్చెదనో వాడే" అని చెప్పాడు. వెంటనే, "ఒక ముక్క ముంచి, సీమోను కుమారుడగు ఇస్కరియోతు యూదాకిచ్చెను." సాతాను యూదాలో ప్రవేశించాడు, గనుక యేసు ఆయనను

అప్పగించనైయుండిన వానితో, "నీవు చేయుచున్నది త్వరగా చేయుమని" చెప్పాడు. యేసు ఈ మాటలు యూదాతోనే ఎందుకు చెప్పుచుండెనో మిగిలిన శిష్యులలో ఎవనికినీ అంతుపట్టలేదు. పస్కా విందు భోజనము నిమిత్తము వాడు సంతకు వెళ్లి అవసరమై యుండిన యింకా కొన్ని సరుకులు తీసికొని రావలెనని యేసు యూదాను సంతకు పంపుచున్నాడేమో లేదా బీదలకు డబ్బు పంచుమని పంపుచున్నాడేమో అని వారనుకొన్నారు. ఇస్కరియోతు యూదా వెంటనే, చీకటి లోనికి (అప్పుడు అది రాత్రి వేళ) వెళ్లిపోయాడు.

### ప్రభు భోజన సంస్కారము వ్యవస్థాపింపబడుట (26:26–29)

**[26]వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టెపట్టుకొని, దాని నాశీర్వదించి, విరిచి తన శిష్యులకిచ్చి – మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరమని చెప్పెను. [27]మరియు ఆయన గిన్నె, పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి వారికిచ్చి–దీనిలోనిది మీరందరు త్రాగుడి.**
**[28]ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము. [29]నా తండ్రి రాజ్యములో మీతో కూడ నేను ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినమువరకు, ఇకను దాని త్రాగనని మీతో చెప్పుచున్నాననెను.**

యేసు తన శిష్యులతో కూడ ఆరగించుచుండిన పస్కా భోజన సమయములో, ఆయనను వెంబడించుచున్నవారు నేటికిని ప్రతి ఆదివారం నాడు ఆచరించు ఒక స్మారక చిహ్నమును వ్యవస్థాపించాడు. ఇది క్రొత్త నిబంధనలో "రొట్టె విరుచుట" (అపొస్తలుల కార్యములు 2:42; 20:7, 11 చూడు). "ఆశీర్వచనపు పాత్ర" (1 కొరింథీయులకు 10:16; KJV), "ప్రభువు బల్ల" (1 కొరింథీయులకు 10:21), మరియు "ప్రభువు రాత్రి భోజనము" (1 కొరింథీయులకు 11:20) అని సంబోధింపబడుచున్నది. ఈ స్మారక చిహ్నముతో సంబంధముగల మరొక పేరు, "యూఖరిస్తు," "దేవునికి కృతజ్ఞత చెల్లించుట" అని అర్థమిచ్చు గ్రీకు పదమునకు (*eucharistia*) ప్రతిలేఖనమై (లిప్యంతరీకరణము) యున్నది.[8] సంబంధిత క్రియాపదము *eucharisteō*, "దేవునికి కృతజ్ఞత చెల్లించుడి" అని అనువదింపబడినది, ఈ స్మారక చిహ్నము వ్యవస్థాపింపబడుట గూర్చి నాలుగు నివేదికలలో వ్రాయబడియున్న వివరములలో అగుపించును (26:27; మార్కు 14:23; లూకా 22:19; 1 కొరింథీయులకు 11:24).

**వచనము 26.** యేసు, కుటుంబ సభ్యులందరికి పస్కా సంఘటనలను వివరించు ఒక కుటుంబములోని తండ్రి పాత్ర వహించాడు. ఈ సమయంలో, ఆయన పస్కా భోజనములోని రెండు పదార్థములకు ఒక నూతన అర్థమును ఆపాదించాడు. మొదటిది, **యేసు ఒక రొట్టె పట్టుకొని, దాని నాశీర్వదించి, విరిచి తన శిష్యులకిచ్చి, –మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరమని చెప్పెను.** అది పస్కా భోజన రొట్టెయై యుండినది గనుక, అది పులియని రొట్టెయై యుండినది (నిర్గమకాండము 12:8). "ఓ ప్రభువా మా దేవా, ఈ విశాల విశ్వమంతటికి రాజైయున్నవాడా, భూమిలో నుండి మాకు ఆహారమును పుట్టించువాడా, నీవు స్తోత్రార్హుడవు" అను మాటలు, ఈ రొట్టె గూర్చిన యూదుల విశేష ఆశీర్వచనమై యుండినది (14:19పై గల వ్యాఖ్యానము చూడు).

"ఇది నా శరీరము" అని యేసు చెప్పినప్పుడు, ఆ సమయంలో ఆయన తన శిష్యుల

యెదుట సశరీరుడుగా ఉండెననియు, గనుక రొట్టె వాస్తవముగా అక్షరార్థమయిన ఆయన శరీరమయ్యిందని ఆయన భావించియుండడనియు మనము జ్ఞాపకముంచుకొనవలెను. దానికి బదులుగా, రొట్టె ఆయన శరీరమునకు చిహ్నామై యుండినది. ఇంకా, "యిది మీకొరకైన నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని" కూడ ఆయన సెలవిచ్చాడు (లూకా 22:19). పౌలు ఇదే ప్రకటనను అటుతరువాత కొరింథీయులకు జ్ఞాపకము చేసాడు (1 కొరింథీయులకు 11:24).

**వచనము 27.** ఆ తరువాత, **ఆయన గిన్నె పట్టుకొని, కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, వారికిచ్చి– దీనిలోనిది మీరందరు త్రాగుడి అని చెప్పాడు.** స్పష్టంగా, యేసు గిన్నెలోని పదార్థమునకు ప్రాధాన్యత నిచ్చుచు దాని గూర్చి నొక్కి వక్కాణించాడు, పదార్థముండిన గిన్నెకు కాదు. "గిన్నె" అను పద ప్రయోగము ఉద్దిష్ట నామానికి బదులు దాని విశేషణాన్ని పేర్కొనడమునకు (ఉదాహరణ కింగ్ అనడానికి బదులు క్రౌన్ అని చెప్పడమునకు – metonymy) ఒక ఉదాహరణమై యున్నది, ఇది దానికి దగ్గరి సంబంధము కలిగియున్న మరొక పదమును సూచించునట్లు ఒక పదమును ప్రయోగించుటకు సాహిత్య సంబంధమైన పద్ధతియై యున్నది.

"ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను ఎత్తికొని" అని పరిశుద్ధుడైన పౌలు చెప్పినందు వలన (1 కొరింథీయులకు 11:25), ఆరాధన క్రమములో అది మూడవ గిన్నెకు అనుగుణమైనదై యుండవచ్చును (26:20పై గల వ్యాఖ్యానము చూడు). మార్విన్ ఆర్. విల్సన్ ఇలా వ్రాయుచున్నాడు, "అది 'విమోచన గిన్నె' యని పిలువబడినది, '... నేను మిమ్మును విడిపించుదును' అని నిర్గమకాండము 6:6లోని నాలుగింతల విమోచనా వాగ్దానముగల యూదా మత బోధకుల సాంప్రదాయ ప్రకారమైన మూడవ గిన్నెతో జోడింపబడినది."[9] యేసు రొట్టెను పట్టుకొనక మునుపు మరియు దాని తరువాత కూడ, ఒక గిన్నెను తీసికొన్నాడని లూకా నివేదించుచున్నాడు. ఏది ఏమైనా, యేసు రెండవ సారి ఎత్తికొనిన గిన్నెకే ప్రత్యేక అర్థమును ఆపాదించాడు (లూకా 22:17–20).[10] పౌలు దీనిని "ఆశీర్వచనపు పాత్ర" అని ప్రస్తావించుచున్నాడు (1 కొరింథీయులకు 10:16).

**వచనము 28. ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము** అని పలుకుచు యేసు ఆ గిన్నె యొక్క ప్రాధాన్యతను వివరించాడు. మరొక పర్యాయము, ఇది అక్షరాలా ఆయన రక్తము కాదు; ఏలయనగా ఆయన వారి యెదుట సశరీరుడుగా ఉండెను, మరియు రక్తము అప్పటికి యింకను "చిందింపబడలేదు." గిన్నె, ఆయన రక్తమును సూచించలేదు, కానీ దానిలో ఉండిన ద్రాక్షారసము కలువరి గిరిపై చిందింపబడనై యుండిన ఆయన రక్తమును సూచించినది.

కొన్ని ప్రాచీన చేతి రాత ప్రతులు "నిబంధన"కు ముందు "క్రొత్త" అను పదమును చేర్చుచున్నవి.[11] ఈ క్రొత్త నిబంధన గూర్చి ప్రవక్తయైన యిర్మీయా అది వ్యవస్థాపింపబడక మునుపే అనేక వందల సంవత్సరముల క్రితం ప్రవచించాడు (యిర్మీయా 31:31–34). హెబ్రీ పత్రిక రచయిత దేవుడు యేసుక్రీస్తు ద్వారా ఒక నూతనమును ఉత్తమమునైన నిబంధనను వ్యవస్థాపించాడని నొక్కివక్కాణించుచు, యిర్మీయా గ్రంథంలో నుంచి ఉల్లేఖించి రచించాడు (హెబ్రీయులకు 8:6–13).

పాత నిబంధనకు వలెనే, సార్థకముగా ప్రయోగింపబడునట్లు క్రొత్త నిబంధన

సహితము రక్తమును ("నిబంధన రక్తమును") కోరుకొనినది. హెబ్రీయులకు 9:15–22 ఈ సమానాంతర వర్ణనను సవివరముగా తెలియజేయుచున్నది. మోషే ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రము నిచ్చినప్పుడు వారు దానికి విధేయులై యుందురని వారు సమ్మతించారు గనుక, ఆయన దూడల రక్తమును తీసికొని నిబంధన గ్రంథము మరియు ప్రజలపై ప్రోక్షించాడు (నిర్గమకాండము 24:5–8 చూడు). యేసు క్రొత్త నిబంధన మధ్యవర్తిగా అరుదెంచాడు, ప్రజలపై ప్రోక్షించి వారిని పవిత్రపరచుటకు తన సొంత రక్తమును చిందించాడు. ఒక తుది వీలునామా మరియు నిబంధనగా, క్రొత్త నిబంధన అమలుపర్చబడునట్లు ఆయన మరణించవలసి యుండినది. అంతమాత్రమేగాక, ప్రజలందరి పాపక్షమాపణను ప్రాప్తించుటకై రక్తము చిందింపబడవలసి యుండినది.

ఆయన రక్తము "అనేకుల కొరకు చిందింపబడుచున్నదని" యేసు చెప్పినప్పుడు, ఆయన యెషయా గ్రంథం 53వ అధ్యాయంలోని మాటలను ప్రతిధ్వనించుచుండెను. ఆ గొప్ప ప్రవచనములో, శ్రమ నొందు సేవకుడు "మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను" మరియు "అనేకుల పాపమును భరించెను" (యెషయా 53:12). యేసు యొక్క బల్యర్పణ లోక పాపముల నిమిత్తము ప్రత్యామ్నాయమైన ప్రాయశ్చిత్తమై యుండినది. ఈ సందర్భములో, "అనేకులు" అనగా "సువార్తమానమును అంగీకరించు వారందరు" అని అర్థము (20:28పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 29. నా తండ్రి రాజ్యములో మీతో కూడ నేను ఈ ద్రాక్షా రసము క్రొత్తదిగా త్రాగు దినమువరకు, ఇకను దాని త్రాగనని మీతో చెప్పుచున్నానని** యేసు తన శిష్యులతో చెప్పాడు.[12] "ద్రాక్షా రసము" (*genēmatos tēs ampelou*) అను పదజాలము, మార్కు 14:25లోను మరియు లూకా 22:18లోను అగుపించుచున్నట్లుగా, యూదుల చేత సర్వసామాన్యముగా ఉపయోగింపబడిన పదమై యున్నది. "ఓ ప్రభువా, మా దేవా, ఈ విశాల విశ్వమంతటినేలుచున్న రాజా, ద్రాక్షా రసమును సృష్టించినవాడా, నీకు స్తోత్రము" అను మాటలు ద్రాక్షా రసము గూర్చి వారు విశేషంగా వల్లించుచుండిన ప్రార్థనయై యుండినది.[13] 27వ వచనములో వ్రాయబడియున్నట్లు, ఆయన గిన్నె ఎత్తికొని స్తోత్రము చేసినప్పుడు, బహుశా యేసు కూడ అటువంటి మాటలనే ఉపయోగించుచు ప్రార్థించియుండవచ్చును.

"ద్రాక్షా రసము" అను పదజాలము యొక్క అర్థము చర్చనీయాంశముగా మిగిలినది. జాక్ పి. లూయిస్ ఇలా చెప్పుచున్నాడు, "'ద్రాక్షా రసము' ... అను ఈ పదమే అది ద్రాక్షా మద్యమై యుండినదో లేక ద్రాక్ష రసమై యుండినదో కచ్చితంగా నిర్వచించదు, కానీ పాలస్తీనాలో ద్రాక్ష పండ్లు ఎండాకాలములో పక్వమగుచుండును మరియు శీతలీకరణము నిమిత్తమైన సౌకర్యములు లేవు గనుక ... పస్కా విందు నిమిత్తము, వసంతకాలములో తాజా ద్రాక్ష రసము అందుబాటులో నుండుట అసంభావ్యమే."[14]

ఏది ఏమైనా, యూదులు వారు సేవించుచుండిన ద్రాక్షా రసమును నీళ్లు కలిపి పలుచనచేయు విధానమును అభ్యసించు అలవాటు కలిగియుండిరి. యూదుల మత బోధకులలో ఒకరు చెప్పినట్లు, "ఒకడు దానిలో నీళ్లు కలుపనంతవరకు వారు ద్రాక్షా రసము కొరకైన ఆశీర్వచనమును వల్లించరు." ద్రాక్షా రసములో నీళ్లు కలుపబడి అది పలుచన చేయబడక మునుపు కూడ ఆశీర్వచనము వల్లింపబడవచ్చునని ఇతర ఋషులు

ప్రతిపాదించారు.[15] ద్రాక్షా రసముండిన ప్రతి గిన్నె "కలుపబడి యున్నదని" మిశ్నాలో గ్రంథస్థంచేయబడిన పస్కా భోజన ఆరాధాన వర్ణన సూచించుచున్నది[16] – నిస్సందేహముగా, కలుపబడినది నీళ్లే. టాల్మడ్ ప్రకారము, పస్కా విందులో ఉపయోగింపబడుచుండిన ద్రాక్షా రసము నీళ్లు కలిసినదై యుండినది – మూడు పాళ్లు నీళ్లు మరియు ఒక పాలు, ద్రాక్షా రసము.[17] ఆది క్రైస్తవులు కూడ ద్రాక్షా రసములో నీళ్లు కలుపుచుండిరి. ప్రభువు భోజన సంస్కారము ఆచరింపబడునపుడెల్లా ఇలా చేయబడునని అనేక మంది రచయితలు పేర్కొనుచున్నారు.[18]

29వ వచనములో, "ద్రాక్షా రసము" అను పదజాలము రాత్రి భోజనమంతటిని సూచించుచున్నది. ఇది ఉపలక్షణమును పోలిన ఒక అర్థాలంకారము (ఉదాహరణ రంజీ ట్రోఫీ ఆంధ్రా గెలిచిందంటే, ఆంధ్రులంతా అని కాదు, ఆంధ్రా జట్టు అని మాత్రమే అర్థం) గూర్చిన ఒక ఉదాహరణమై యున్నది – మొత్తమంతటిని దృష్టిలో ఉంచుకొని, కొంత భాగమును సూచించునది. ఆయన "తన తండ్రి రాజ్యములో" వారితో కూడ ఈ భోజనములో పాల్గొనునంత వరకు ఆయన ఈ పస్కా భోజన సంస్కారమును ఆచరించడని యేసు తన శిష్యులతో చెప్పాడు.

యేసు చేసిన ఈ ఘోషణ రెండు విధములుగా అర్థవివరణ గావింపబడుచున్నది. మొదటిది, రాజ్యము (సంఘము) లోకములో పెంతెకొస్తు దినము నాడు ఉద్భవించినందు వలన (అపొస్తలుల కార్యములు 2 అధ్యాయం.), వారు ఈ జ్ఞాపకార్థ విందును ఆచరించునప్పుడు ఆయన వారితో కూడ పాల్గొనునని యేసు తన శిష్యులకు వాగ్దానము చేసియుండవచ్చును. ఆయన మన కంటికి కనబడకపోయినప్పటికిని, ప్రభువు దినాన సంఘము ప్రభువు భోజన సంస్కార ఆరాధానా నిమిత్తము కూడుకొనునప్పుడు అతిథేయిగా అధ్యక్షత వహించేది ఆయనే.

రెండవది, బహుశా పరలోక రాజ్యములో యుగాంతమందు క్రీస్తుతో కూడ శిష్యులు కలిగియుండు సహవాసము గూర్చి యేసు ప్రస్తావించియుండవచ్చును. అనేక వాక్యభాగములు మెస్సీయ సంబంధమైన ఈ విందును సూచింపవచ్చును (8:11; లూకా 13:29; 14:15; 22:16, 17, 29, 30; ప్రకటన 19:9). యుగాంతమును సూచించుటకు "ఆ దినము" అను మాట ఒక సామాన్య వ్యక్తీకరణమై యున్నది (24:36; లూకా 21:34; 2 థెస్సలొనీకయులకు 1:10; 2 తిమోతి 1:18; 4:8).

ఈ రెండు అర్థములు సాధ్యమనుటకు సమంజసమైనవే నంటూ లూయిస్ దానిని సమర్థించుచున్నాడు, కానీ రెండవ అర్థము అత్యంత ప్రధానమైనదని కూడ ఆయన భావించుచున్నాడు:

> పండితోత్తములు సాధారణంగా పరలోక విందును సూచించుచు, యేసు చేసిన ఘోషణను అక్షరాల మందబుద్ధితో ఉన్నదున్నట్టు అర్థంచేసికొనకూడదని పట్టుబట్టారు ... కానీ వాస్తవమునకు వారందరు "ఆయన వచ్చు వరకు" (1 కొరింథీయులకు 11:26) పాల్గొనుచుండు సహవాస విందులలో ప్రభువు తన ప్రజలతో కూడ నుండును. వారి సహవాసము ఆనందానుభూతి చెందనైయున్న తరువాతి సహవాసము యొక్క పూర్వపు దివ్య సౌభాగ్యమై యున్నది.[19]

యేసు ప్రభురాత్రి భోజనమును వ్యవస్థాపించినప్పుడు, ఆయన ఏమి చెప్పుచుండెనో, ఏమి చేయుచుండెనో దాని ప్రాముఖ్యతను గ్రహించుట అపొస్తలులకు కష్టముగా నుండినది. పునరుత్థానము తరువాత మరియు యేసు ఆ మీదట ఆదేశములను తెలియజెప్పిన తరువాతనే ఈ విషయముల గూర్చిన అవగాహన వారిలో అంతకంతకు అధికమగుచుండినది (లూకా 24:44-47 చూడు). సంఘము సమారంభమైనప్పుడు, పరిశుద్ధాత్మతో నింపబడిన అపొస్తలులు ప్రభు భోజన సంస్కారము గూర్చి యేసు క్రీస్తునందు విశ్వాసముంచి, బాప్తిస్మము పొందిన వారికి వివరించి యుందురు. నూతనముగా ప్రభువునంగీకరించినవారు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, *రొట్టె విరుచుటయందును,* ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి" (అపొస్తలుల కార్యములు 2:42). మత్తయి, తన సువార్తను రచించిన నాటికి, ప్రభుభోజన సంస్కారము సుస్థిరముగా వ్యవస్థాపింపబడినది. ఈ విందు వ్యవస్థాపింపబడిన ఆ నాటి రాత్రి అపొస్తలులు కలిగియుండిన దాని కంటె, మత్తయి సువార్త ప్రారంభ పాఠకులు వాక్యభాగమును బహు చక్కగా అర్థంచేసికొనినవారై జ్ఞాపకార్థ విందులో పాల్గొని యుందురు.[20]

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## పస్కా భోజనము (26:17-19)

దేవుడు ఐగుప్తులోని మనుష్యుల మరియు జంతువుల తొలి సంతానముపై మరణ శాసనమును జారీచేసిన ఆ నాటి రాత్రి పస్కా భోజన సంస్కారము వ్యవస్థాపింపబడినది (నిర్గమకాండము 11:4, 5; 12:12, 13, 23-29). వారు ఆయన ఆజ్ఞలను అనుసరించినట్లయితే వారిలో ఏ ఒక్కడైనను మరణించడని దేవుడైనా యెహోవా ఇశ్రాయేలీయులకు వాగ్దానము చేసాడు (నిర్గమకాండము 11:7). ప్రజలు నెల లోని పదవ దినమున, ఒక్కొక్క కుటుంబము చొప్పున ప్రతి ఒక్క కుటుంబము యేడాది వయస్సున్న మచ్చలేని మగ గొఱ్ఱెపిల్లలను ఎన్నుకొనునట్లు తెలియజెప్పుమని ఆయన మోషేకు ఆదేశములిచ్చాడు (నిర్గమకాండము 12:3-5). ప్రతి కుటుంబము వారి గొఱ్ఱెపిల్లను నెల లోని పదునాలుగవ దినము వరకు ఉంచిన తరువాత, సంజవేళ వధించి, నిప్పుల మీద కాల్చి, ఆ నాటి రాత్రి పులియని రొట్టెతోను చేదు ఆకుకూరలతోను భుజించవలెను (నిర్గమకాండము 12:6, 8). ఈ దినము ఇశ్రాయేలీయుల చరిత్రలో ఒక నిర్దిష్ట స్థితి అర్థమును నిర్ధారణ చేయు క్షణమయ్యింది. మహత్వపూర్ణమైన ఈ సంఘటనను ప్రతిబింబింపజేయునట్లు వారి కేలండరు సహితము మార్చబడింది. తొలి పస్కా విందు ఆచరింపబడిన నెల వారికి సంవత్సరములోని మొదటి నెల అయ్యింది (నిర్గమకాండము 12:2), అది కనాను దేశ భాషలో ఆబీబు నెల అని పిలువబడింది (నిర్గమకాండము 13:4), మరియు బబులోను దేశ భాషలో నీసాను మాసమని పిలువబడింది (ఎస్తేరు 3:7; నెహెమ్యా 2:1).

ఇశ్రాయేలీయుల ఈ భోజనము చేయవలసిన విధానము గూర్చి వారికి ఖచ్చితమైన ఆదేశములు జారీచేయబడినవి. పస్కా గొఱ్ఱెపిల్ల సంపూర్తిగా నిప్పులపై కాల్చబడవలెను; కాల్చబడని పచ్చి మాంసము తినకూడదు లేదా దానిని ఉడకబెట్టకూడదు. ఆ నాటి రాత్రి గొఱ్ఱెపిల్ల మాంసమంతటిని పూర్తిగా భుజించవలెను, లేదంటే ఒక వేళ

ఏమైనా మిగిలియున్నట్లయితే అది అగ్నితో కాల్చివేయబడవలెను (నిర్గమకాండము 12:9, 10). ఈ విందులో పాల్గొనువారందరు దుస్తులను నిండుగా ధరించవలెను, చెప్పులు తొడుగుకొనవలెను (నిర్గమకాండము 12:4). ప్రయాణం చెయవలెనని ఏ నిమిషంలో తెలియజెప్పబడినా పయనించుటకు సంసిద్ధులై యుండవలెను (నిర్గమకాండము 12:11). వధింపబడిన జంతువు యొక్క రక్తము వారు విందారగించిన ఇంటి ద్వారబంధములకు మరియు పైకమ్మీలకు పూయబడవలెను (నిర్గమకాండము 12:7).

దేవుడు ఈ సంఘటనకు "పస్కా బలి" అని పేరుపెట్టాడు (నిర్గమకాండము 12:11), ఏలయనగా ఇంటి ద్వారబంధములకు రక్తము పూయబడిన ఇండ్లను ఆయన దాటిపోయాడు. మోషే ఇశ్రాయేలీయుల పెద్దలను సమావేశపర్చి వారికి ఆదేశములిచ్చాడు. అదొక నిత్యమైన కట్టడయై యుండవలెను. వారు వాగ్దాన దేశములోనికి ప్రవేశించిన తరువాత, ఈ విందును ఆచరించుట మానుకొనకూడదు మరియు అది ఏమిటో, దాని భావమేమిటో వారి పిల్లలకు సవివరంగా తెలియజెప్పవలెను (నిర్గమకాండము 12:24-27).

పస్కా బల్యర్పణ విధానమును పాటించవలెనని క్రైస్తవులు ఆజ్ఞాపింపబడలేదు. ఈ బల్యర్పణ మనకు పొసగదు. "మీరు పులిపిండి లేనివారు గనుక, క్రొత్త ముద్ద అవుటకై ఆ పాతదైన పులిపిండిని తీసిపారవేయుడి" అని పౌలు రచించాడు (1 కొరింథీయులకు 5:7). పౌలు, క్రీస్తు మరణమునకును పస్కా పండుగ సందర్భములో వధింపబడిన పస్కా గొఱ్ఱె పిల్లకును సంబంధమును ముడిపెట్టుచుండెను. యూదులు ఐగుప్తు దాసత్వము నుండి విడుదల గావింపబడుట మరియు వారు దేవుని ప్రజలుగా దత్తతచేసికొనబడిన మహోత్సవమును ఆ గొఱ్ఱెపిల్ల సుస్థిరముగా గుర్తుచేయుచున్నది. మన పాపముల నిమిత్తమైన యేసుక్రీస్తు యొక్క త్యాగము గూర్చి కొరింథీ పట్టణములోని విశ్వాసులకు వ్రాస్తూ, దేవుని ద్వారా ప్రాప్తించిన విడుదల మరియు ఆయన యొక్క ప్రత్యేకమైన ప్రజలముగా, ప్రభువు యొక్క సంఘముగా దత్తత చేసికొనబడుట గూర్చి పౌలు క్రైస్తవులందరికి గుర్తుచేయుచున్నాడు. వాగ్దాన దేశములో వారి నూతన జీవితమును కళంకముచేయు దేనినైనను ఇశ్రాయేలీయులు వారి జీవితములలో నుండి తీసిపారవేయవలసి యుండినట్లే, యేసు క్రీస్తు నందలి మన నూతన జీవితములను కళంకితముచేయు పాపిష్ఠివైన వైఖరులు లేదా చర్యలు ఏవైనను క్రైస్తవులమైన మనము మన జీవితములలో నుండి తొలగించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది (కొలొస్సయులకు 3:1-11).

### ఇస్కరియోతు యూదా నష్టపోయిన నగదు (26:20-25)

పస్కా విందు ముగియక మునుపే ఇస్కరియోతు యూదా వారందరి మధ్యలో నుండి వెళ్లిపోయాడు (యోహాను 13:30) గనుక అర్థసహితమైన అనేక ఆనందానుభూతులను నష్టపోయాడు. మానవాళి పాపపరిహారము నిమిత్తమై చేయబడిన యేసుక్రీస్తు తుది బలియాగమునకు స్మారక చిహ్నముగా నుండినది, ప్రభు రాత్రి భోజన సంస్కారము వ్యవస్థాపింపబడిన సమయంలో అతడు లేడు (26:26-29). యోహాను సువార్త 14:1-21లో వ్రాయబడి యున్నట్లు, యేసు ప్రభువు ఇతర అపొస్తలులను ఉద్దేశించి సెలవిచ్చుచుండిన ప్రోత్సాహకరమైన మాటలను అతడు లక్ష్యపెట్టలేదు. అపొస్తలులు ఆదరింపబడునట్లు, ఆయన మాటలను వారికి బోధించుచు గుర్తుచేయునట్లు, మరియు

వారిని సర్వ సత్యములోనికి నడిపించునట్లు పరిశుద్ధాత్మను పంపించునని యేసు చేసిన వాగ్దానమును అతడు ఎన్నడును తెలిసికొనలేదు (యోహాను 14:23-27; 15:26, 27; 16:13-15). ఆయన యందు నిలిచియుండుట ఎంత ప్రాముఖ్యమైనదో వివరించుచూ, ద్రాక్షా వల్లి మరియు తీగెల గూర్చి యేసు బోధించినప్పుడు అతడు అక్కడ లేడు (యోహాను 15:1-17). విశ్వాసులందరును ఏకమై యుండుటను యేసు ఎంతో ఆశించుచుండెనని తెలియజేయు ప్రార్థన, ప్రభువు శిష్యుల నిమిత్తము ప్రార్థించిన సమయంలో కూడ అతడు లేడు (యోహాను 17:1-26).

## ప్రభు రాత్రి భోజనమును ఆచరించుట (26:26-29)

ఈ రోజుల్లో అనేకమైన మతసంబంధ గుంపులు ప్రభు రాత్రి భోజన సంస్కారమును వారములోని ఆ యా రోజుల్లోను, వివాహ శుభకార్యములు, భూస్థాపన కార్యక్రమములు, జన్మదినములు, బాప్తిస్మము పొందిన సమయముల వంటి ప్రత్యేక సందర్భములలోను ఆచరించుచున్నవి. ఇవ్విధమైన అభ్యాసములకు గల ఆధారము బైబిలులో అగుపించదు. వారములోని మొదటి దినమున గాక, ఇతరమైన మరి ఏ నాడైనను లేదా ఇతర విరామములందును ప్రభు రాత్రి భోజన సంస్కారమును ఆచరించుటకు మనకు లేఖనానుసారమైన ఏ అధికారము లేదు. ప్రభు రాత్రి భోజన సంస్కారము ఆదివారం నాడు మాత్రమే ఆచరింపబడినదని చారిత్రాత్మకమైన అత్యంత ఆది కాలము నాటి నివేదికలు తెలియజెప్పుచున్నవి.

త్రోయలో నివసించుచుండిన క్రైస్తవ విశ్వాసులు “ఆదివారమున … రొట్టెవిరుచుటకు కూడుకొనుచుండిరని” లూకా గ్రంథస్థంచేసాడు (అపొస్తలుల కార్యములు 20:7). కొరింథు పట్టణములో నుండిన క్రైస్తవ విశ్వాసుల వాడుక కూడ ఇదే అయియుండినది (1 కొరింథీయులకు 11:20, 21, 33; 16:2). సంఘము అనేక శతాబ్దముల వరకు ఇదే అభ్యాసమును కొనసాగించినదని మనము ఆది కాల చరిత్రకారుల నుండి తెలిసికొనుచున్నాము.[21] క్రైస్తవులు ప్రభు రాత్రి భోజన సంస్కారమును ఆదివారంనాడే ఎందుకు ఆచరించవలెను? ఆదివారం, వారములోని మొదటిదినము, యేసు మృతులలో నుండి పునరుత్థానుడైన దినమై యున్నది (28:1-7; లూకా 24:1-7).[22] యేసు పునరుత్థానుడైన పిదప ఏదో ఒక దినాన ఆగుపించాడని పేర్కొనబడిన దినము అనివార్యముగా అది ఆదివారమై యుండినది.[23] యేసు ఆరోహణుడైనది, ఆదివారంనాడే (అపొస్తలుల కార్యములు 1:3, 9). సంఘము లోకములో ఉద్భవించినది, ఆదివారంనాడే (అపొస్తలుల కార్యములు 2:1), ఏలయనగా పెంతెకొస్తు దినం వారములోని మొదటి దినాననే ఆచరింపబడినది (లేవీయకాండము 23:15-21). ఆదివారముగాక వారములోని మరి ఏ దినమైనను ఈ హోదాతో పిలువవలెననుటకు లేక ఆదివారంనాడు గాక వారములోని మరి ఏ దినమునాడైనను ప్రభు రాత్రి భోజనము ఆచరింపబడవలెనని చెప్పుటకు ఏ హేతువైనను లేదు.

## ప్రభు రాత్రి భోజన సంస్కారము (26:26-29)

ప్రభు రాత్రి భోజన సంస్కారములో ఐదు ప్రాముఖ్యమైన దృష్టికోణములున్నవి:

1. కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచుండు ఊర్ధ్వముఖ చూపు (1 కొరింథీయులకు 11:23–25);
2. జ్ఞాపకము చేసికొను తిరోగమన చూపు (1 కొరింథీయులకు 11:24, 25);
3. దీనిని ప్రచురము చేయు బహిరంగ చూపు (1 కొరింథీయులకు 11:26);
4. ఆశతో ఎదురుచూచుచుండు ముందుచూపు (1 కొరింథీయులకు 11:26);
5. అంతరంగమును పరీక్షించుకొను అంతర్ముఖ చూపు (1 కొరింథీయులకు 11:27, 28).

---

సూచనలు

[1]Josephus *Wars* 6.9.3; Mishnah *Pesahim* 5.1 చూడు. [2]Mishnah *Pesahim* 5.5-10; 7.1, 2. [3]యోహాను సువార్త 13వ అధ్యాయంలో పేర్కొనబడిన భోజనము, యేసు ప్రభురాత్రి భోజన సంస్కారమును వ్యవస్థాపించిన పస్కా భోజనముగా పరిగణింపబడవలెను (ఇదే విషయము సమదృక్పథ సువార్తలలో గ్రంథస్థం చేయబడియున్నది). యోహాను 18:28లో వ్రాయబడియున్నట్లు యూదీయ నాయకులు "పస్కాను భుజించుటకు" ఆశించుట గూర్చిన ప్రస్తావన, విందు మొత్తమును, పస్కా భోజనమునే మరియు దాని వెనువెంట వచ్చిన పులియని రొట్టెల దినములను సూచింపవచ్చును. Frank Pack's discussion of this problem in *The Gospel According to John,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1977), 42-44 చూడు. యోహాను 19:14, 31, 42లోని "సిద్ధపరచు దినము" పిలాతు యెదుట యేసుకు తీర్పు తీర్చబడిన శుక్రవారమును, సబ్బాతు దినమునకు ముందటి దినమును (పస్కా పండుగ వారములో వచ్చిన దినమును) సూచించుచున్నది. [4]Mishnah *Pesahim* 10.1-9 చూడుము; John Lightfoot, *A Commentary on the New Testament from the Talmud and Hebraica: Matthew - 1 Corinthians*, vol. 2, *Matthew - Mark* (Oxford University Press, 1859; reprint, Grand Rapids, Mich.: Baker, 1979), 346-49. [5]చేదు ఆకు కూరలు ఇశ్రాయేలీయులు ఐగుప్తులో అనుభవించిన చేదు అనుభవములను సూచించుచున్నవి. పులియని రొట్టె, వారిని ఐగుప్తులో నుండి విడుదలగావించుటకు దేవునికుండిన ఆతురతను వారికి గుర్తుచేసినది. (Mishnah *Pesahim* 10.5.) [6]ఇది దేవాలయములో బల్యర్పణ గావింపబడిన గొఱ్ఱెపిల్లయై యుండెను. ఇశ్రాయేలీయుల తొలి సంతానము సంహరింపబడక విడిచిపెట్టబడిన మొట్టమొదటి పస్కాను అది గుర్తుచేసినది. (Ibid.) [7]యోహాను 13:26లో, "ముక్క" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*psōmion*), గొఱ్ఱెపిల్ల యొక్క ఒక చిన్న మాంసము ముక్కను సూచింపవచ్చును, కానీ ఎక్కువగా చిన్న రొట్టె ముక్కను సూచించును (NIV; NRSV; NJB; NEB; JNT చూడు). యోహాను, కీర్తనలు 41:9ని ఉల్లేఖించిన దానితో ఇది పొసగుచున్నది, అచ్చట "రొట్టె" (*artos*) - భోజనము – అను పదము వాడబడినది (యోహాను 13:18). [8]"యూఖరిస్తు" అను పదము ప్రభు భోజన సంస్కారమును సూచించుటకు రెండవ శతాబ్దములోనే వాడబడినది. (Ignatius *Philadelphians* 4.1; *Smyrnaeans* 6.2; *Didache* 9.1, 5.) [9]Marvin R. Wilson, "Passover," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:678. [10]లూకా 22:17–20లో గల గ్రంథ పాఠమునకు సంబంధించిన కష్టముల చర్చ కొరకు, Bruce M. Metzger, *A Textual Commentary on the Greek New Testament,* 2d ed. (Stuttgart: German Bible Society, 1994), 148-50 చూడు.

[11]Ibid., 54. సంబంధిత పఠనము లూకా 22:20లో నిర్వివాదాంశమై యున్నది. [12]ఈ మాటలను (కొంచెము భిన్నముగానే అయినను) లూకా అంతకు ముందటి గిన్నెతో ముడిపెట్టాడు (లూకా 22:17, 18). [13]Mishnah *Berakoth* 6.1. [14]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 147. [15]Mishnah *Berakoth* 7.5. [16]Mishnah *Pesahim* 10.2, 4, 7. [17]Talmud *Pesahim* 108b. [18]Justin Martyr *Apology* 1.67; Clement of Alexandria *Instructor* 2.2; Cyprian *Epistles* 62.2. [19]Lewis, 148. [20]Ronald A. Hagner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 775.

[21]*Didache* 14.1; Justin Martyr *Apology* 1.67; Eusebius *Ecclesiastical History* 3.27. [22]యేసు

పునరుత్థానమునకును, ప్రభువు దినాన జరిపించబడు ఆరాధనలకును మధ్య గల సంబంధమును ఆది కాల క్రైస్తవ రచయితలలో అనేకులు నొక్కివక్కాణించారు. (*Barnabas* 15.8, 9; lgnatius *Magnesians* 9; Justin Martyr *Apology* 1.67; Eusebius *Ecclesiastical History* 3.27.) [23]David L. Roper, *Acts 1-14*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2001), 25.